సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం : 29 : జూలై : 2023



రోడ్డెక్కిన వేల్పూరు 'పంచాయితీ'

తణుకు మండలం వేల్పూరు పంచాయతీలో టీడీపీ బలపర్చిన పాలకవర్గం అక్రమాలు, అవినీతి చర్చనీయాంశంగా మారింది.

IIలో ▸



పాపికొండల్లో పెద్ద పులులు

పాపికొండలు అభయారణ్యం పులి గాండ్రింపులతో పులకిస్తోంది. ఇక్కడ నాలుగు పులులు, ఐదు చిరుతలు ఉన్నట్లు గుర్తించారు.

IIలో ▸

ఐటీడీఏ పీఓగా సూర్యతేజ



బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా ఎం.సూర్యతేజ నియమితులయ్యారు. నరసాపురం సబ్ కలెక్టర్‌గా ఉన్న సూర్యతేజను ఐటీడీఏ పీఓగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయి.

న్యూస్‌రీల్

పోలీసులు మెరుగైన సేవలందించాలి



భీమవరంలో పోలీసు పరేడ్

సాక్షి, భీమవరం: పోలీస్ సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలందించగలరని ఎస్పీ యు.రవి ప్రకాష్ అన్నారు. భీమవరం మార్కెట్‌యార్డ్ ఆవరణలో శుక్రవారం సివిల్, ఏఆర్, హోం గార్డ్ పోలీస్ సిబ్బందికి నిర్వహించిన పరేడ్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివస్‌ను నిర్వహిస్తున్నామన్నామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ బండారు శ్రీనాథ్, ఏఆర్ డీఎస్పీలు ఎన్వీ సత్యనారాయణ, ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మత్తు మందుల విక్రయాలపై చర్యలు



అబిత్ అలీ షేక్, నియంత్రణ అధికారి

భీమవరం (ప్రకాశం చౌక్): మెడికల్ షాపుల్లో డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయించినా, అధిక మొత్తంతో విక్రయాలు జరిగినా క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని భీమవరం ఔషధ నియంత్రణ అధికారి అబిత్ అలీ షేక్ హెచ్చరించారు. మూడు రోజులుగా జిల్లాలోని మెడికల్ దుకాణాల్లో జరుగుతున్న సోదాల నేపథ్యంలో శుక్రవారం భీమవరంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గురువారం కోపల్లెలో శ్రీ పద్మ మెడికల్ అండ్ ఫ్యాన్సీ జనరల్ స్టోర్ నుంచి ఏడాది కాలంలో 4,500 మత్తుమందులు విక్రయించినట్టు సోదాల్లో బయటపడిందన్నారు. వీరిపై చర్యలు తప్పవన్నారు. అలాగే భీమవరం ప్రాంతంలో కొన్ని షాపులపై నిఘా ఉంచి తనిఖీలు చేస్తున్నామన్నారు. నిబంధనలు మీరితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సచివాలయాల ద్వారా 'ఓపెన్' అడ్మిషన్లు

సాక్షి, భీమవరం: ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరే అభ్యర్థులు గ్రామ, వార్డు సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం స్థానిక పొట్టిశ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూల్లో ఓపెన్ స్కూల్స్ అడ్మిషన్లపై ఏఐ కో–ఆర్డినేటర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టడీ తరగతులు నిర్వహించాలని, అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించిన తర్వాతే అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఏపీఓఎస్ఎస్ ద్వారా ప్రవేశాలు కల్పించాలన్నారు. స్టేట్ కో–ఆర్డినేటర్ ఎస్.శివకోటేశ్వరరావు, ఈ.నారాయణ, డి.శ్రీరామ్, కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వరిలో రక్షణ చర్యలు చేపట్టాలి



నారుమడిలో నీరు బయటకు తోడుతున్న రైతు

సాక్షి, భీమవరం: జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో సార్వా వరి సాగు చేస్తుండగా ఇప్పటికే సుమారు 60 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. పలుచోట్ల పొలాలు నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 2,925 ఎకరాల్లో నారుమడులు, 4,930 ఎకరాల్లో నాట్లు నీటమునిగినట్టు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. రైతులు పొలాల్లో చేరిన నీటిని ఆయిల్ ఇంజిన్లు, కారెం సహాయంతో బయటకు తోడుతున్నారు. నాట్లు కుళ్లిపోకుండా రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడులు, నాట్లు వేసిన భూముల్లో మురుగునీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటే రెండు, మూడు రోజులు నీటిలో ఉన్నా పంటకు నష్టం ఉండదని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. మురుగునీరు బయటకు వెళ్లగానే పొలాల్లో కార్బన్‌డైజిమ్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి నారు, నాట్లు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. అలాగే 4 మిల్లీలీటర్ల నానో యూరియా లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల నష్టాన్ని నివారించవచ్చని ఆయన సూచించారు.

ఉధృతంగా గోదావరి



యలమంచిలి: చించినాడ వంతెన దిగువన గట్టును తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి

- రెండు మండలాల్లో 19 గ్రామాల ప్రజల తరలింపు
- తక్షణ చర్యలకు ఏలూరు జిల్లాకు రూ.3 కోట్లు, పశ్చిమకు రూ.2 కోట్ల మంజూరు
- కలెక్టర్లతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్
- లంక గ్రామాలను తాకుతూ వరద నీరు
- పోలవరం ప్రాజెక్ట్ నుంచి 11.55 లక్షల క్యూసెక్కులు దిగువకు..

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గోదావరి వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. పోలవరం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో ముంపు ప్రాంతాలతో పాటు లంక గ్రామాల్లో వరద ప్రభావం మొదలైంది. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 19 గ్రామాలు, పశ్చిమగోదావరి జిల్లాలోని రెండు లంక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. మరోవైపు ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం వరద సహాయక చర్యల్లో పాల్గొంటూ బాధితులకు భరోసా ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరద నియంత్రణ, తక్షణ సహాయక చర్యల కోసం ఏలూరు జిల్లాకు రూ.3 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాకు రూ.2 కోట్లు మంజూరు చేసింది.

ఉపనదుల నుంచి భారీగా..

గోదావరితో పాటు పరీవాహక ప్రాంతంలోని ఉపనదుల నుంచి కూడా నీరు చేరడంతో తీవ్రత మరింత పెరిగింది. భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రం 52 అడుగుల మేర నీరు చేరడంతో భారీగా దిగువకు విడుదల చేశారు. శనివారం కూడా వరద తీవ్రత కొనసాగుతుందని జలవనరుల శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. తెలంగాణతో పాటు ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవడం గోదావరి, శబరి నదుల నుంచి వరద నీటితో పోటెత్తుతోంది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయానికి పోలవరం స్పిల్‌వే వద్ద 33.340 మీటర్ల ఎత్తు నుంచి దిగువకు 48 గేట్ల ద్వారా 11,55,833 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శనివారం ఉదయానికి భద్రాచలం వద్ద 60 అడుగులు దాటుతుందని అధికారుల అంచనా.

ముంపు మండలాల్లో..

వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస శిబిరాలకు తరలించారు. సుద్దగుంపు, శ్రీరామపురం, ఆసుపత్రికాలనీ, వేలేరుపాడులోని సంతబజార్, నడిమిగొమ్ము, రేపాకగొమ్ము, రుద్రమ్మకోట, తిరుమలాపురం, పాతనార్లవరం, తాటూకూరుగొమ్ము గ్రామాల్లో ప్రధాన రహదారులతో పాటు ఇళ్లల్లోకి నీరు చేరడంతో 907 కుటుంబాలను పునరావాస శిబిరాలకు తరలించారు. కుక్కునూరు మండలంలోని కుక్కునూరు, కొండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, ఆంబోతులగూడెం, చెరువుకొమ్ముగూడెం, శ్రీధర, అమరవరం పాతూరు, ఎలకలగూడెం గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలకు పునరావాస శిబిరాలకు తరలించారు.

జలాశయాలకు భారీగా.. ఏలూరు జిల్లాలోని ఎర్రకాల్వ, తమ్మిలేరు, జల్లేరు జలాశయాలు గరిష్ఠ నీటిమట్టానికి చేరాయి. ఎర్రకాల్వకు 3,360 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. తమ్మిలేరు ప్రాజెక్టుకు 4,600 క్యూసెక్కుల నీరు చేరింది. జల్లేరు నుంచి 150 క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు.

అప్రమత్తంగా అధికారులు



కోడేరులో అధికారులతో కలెక్టర్ ప్రశాంతి

పెనుగొండ: గోదావరి వరదపై పరీవాహక ప్రాంతంలోని అధికారులంతా అప్రమత్తంగా ఉన్నారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం ఆచంట మండలం కోడేరులో గోదావరి ఉధృతిని పరిశీలించారు. లంక, లోతట్టు ప్రాంతాల్లో ప్రతి గ్రామానికి ప్రత్యేకాధికారిని నియమించామన్నారు. వాహనాలు, బోట్లు సిద్ధం చేశామన్నారు. పునరావాస శిబిరాలు ఏర్పాట్లు చేశామన్నారు. లంక గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 18 మందిని గుర్తించి ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పామన్నారు. ఏటిగట్లు నిరంతరం పర్యవేక్షించాలని, రక్షణ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ ఎస్వీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాథరావు పాల్గొన్నారు.

గంట గంటకూ పెరుగుతూ..



వలంధర్ రేవులో వరద నీరు

నరసాపురం రూరల్: నరసాపురం వశిష్ట గోదావరి ఉధృతి గంట గంటకూ పెరుగుతోంది. నరసాపురంలో వశిష్ట కుడి ఏటిగట్టు వద్ద పరిస్థితిని తహసీల్దార్ పరిశీలిస్తున్నారు. గట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో సర్వే బాదులు, ఇసుక మూటలు సిద్ధం చేశారు. అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు, మైనర్ స్లూయిజ్‌ల వద్ద పరిస్థితులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వలంధర్ రేవులో గోదావరి మాత విగ్రహం, పిండ ప్రధాన మండపాలను తాకుతూ వరద నీరు ప్రవహిస్తోంది. లలితాంబరేవు, స్టీమర్ రోడ్డు వద్ద గోదావరి ఉగ్రంగా ప్రవహిస్తోంది. అధికారులు అన్నిరకాలుగా రక్షణ చర్యలకు ఏర్పాట్లు చేశారు.

లంక గ్రామాలకు వరద తాకిడి

యలమంచిలి: గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో యలమంచిలి మండలంలోని లంక గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి మరింత నీరు వదిలే అవకాశం ఉందని అదే జరిగితే మరిన్ని లంక గ్రామాలు ముంపు బారిన పడతాయని తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ తెలిపారు. లంక గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్నిరకాల చర్యలు తీసుకున్నామన్నారు. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించిన వెంటనే పునరావాస కేంద్రాలకు వచ్చేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. ప్రస్తుతం కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, ఏనుగువానిలంక, బాడవ గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమైనట్టు చెప్పారు. వరద పెరిగితే వాకలగరువు, దొడ్డిపట్ల మత్స్యకార కాలనీ, అబ్బిరాజుపాలెం ఏటిగట్టు దిగువ, గంగడుపాలెం, యలమంచిలిలంక గ్రామాలకు కూడా వరద వచ్చే అవకాశం ఉందన్నారు. వరదతో నక్కల, కాజ డ్రెయిన్లు పొంగడంతో వడ్డిలంక, నారినమెరక, మట్లపాలెం, ఏనుగువానిలంక గ్రామాలకు కూడా వరద వస్తుందన్నారు. పునరావాస కేంద్రాల ద్వారా ప్రజలకు ఆహారం అందించడంతో పాటు, పశుగ్రాసం కూడా సిద్ధం చేసినట్లు తహసీల్దార్ చెప్పారు.



యలమంచిలి: కనకాయలంకలో ఇళ్లను చుట్టుముట్టిన వరద



యలమంచిలి: బాడవలో ముంపునకు గురైన ఇటుక బట్టీలు

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

పోడూరు: గోదావరిలో వరద పెరగడంతో పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పర్యటించారు. రానున్న రెండు రోజుల్లో వరద మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సిద్ధాంతం కాలనీలో డ్రైనేజీ సమస్యను ఆయన పరిశీలించి కనకదుర్గమ్మ ఆలయం వరకు డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. నడిపూడిలో కూడా డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనిరాజు, ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి రాముడు, సొసైటీ చైర్మన్ బలువు కృష్ణమూర్తి ఆయన వెంట ఉన్నారు.

ఆచంట మండలంలో లంకలకు తాకుతూ..

ఆచంట మండలంలోని లంక గ్రామాలకు వరద తాకిడి పెరిగింది. అయోధ్యలంక, పుచ్చలంక, పెద మల్లంలంక, మర్రిమూలలంక, అనగారిలంక గ్రామాల్లోకి వరదనీరు చేరింది. ఆయా గ్రామాల్లో తోటలు, పంటలు నీటమునిగాయి. ఆయా పంట ఉత్పత్తులను రైతులు పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాల్లోకి తరలించే ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు.



సిద్ధాంతంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు



వేలేరుపాడు: రేపాకగొమ్ము నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

వరదను సమర్థంగా ఎదుర్కొంటాం: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): గోదావరి వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో తీసుకున్న చర్యలను కలెక్టర్ వివరించారు. కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటుచేశామని, రెస్క్యూ, పునరావాసం కోసం ప్రత్యేక అధికారులను, సిబ్బందిని నియమించామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఎలాంటి నష్టం జరగలేదని, ఇళ్లు ముంపునకు గురికాలేదన్నారు. యలమంచిలి మండలం కనకాయలంకలో కాజ్‌వే నీటమునగగా.. మోటార్ పడవలు ఏర్పాటుచేశామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో రక్షణ చర్యలు ఆదేశించామన్నారు. యలమంచిలి, ఆచంట, నరసాపురం బియ్యం, నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచామన్నారు. కనకాయలంక, పెదలంక గ్రామాలు వరద ప్రభావానికి గురికాగా.. అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. 22 వైద్య శిబిరాలు ఏర్పాటుచేశామన్నారు. ఐదు రెస్క్యూ బృందాలు, 40 లైఫ్ జాకెట్స్, మూడు బోట్లను సిద్ధం చేశామన్నారు. భీమవరం డివిజన్‌లో అధిక వర్షాలకు మూడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, నరసాపురం పరిధిలోని 10 గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాలు ముంపు బారిన పడిందన్నారు. ఫ్లడ్ బ్యాంక్స్ పటిష్టత, మరమ్మతుల కోసం రూ.20 కోట్ల నిధులు మంజూరుకు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రస్తుతం నాలుగు ప్రాంతాల్లో స్లూయిజ్‌లు, ఫ్లడ్ బ్యాంక్స్ అత్యవసర మరమ్మతులకు రూ.63 లక్షలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

మంచి పోలీసింగ్‌తో శాంతిభద్రతల అదుపు

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: శాంతిభద్రతలు అదుపులో ఉండాలంటే అది మంచి పోలీసింగ్‌తోనే సాధ్యమని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన కోరికను మన్నించి పోలీసు సబ్‌డివిజన్ కార్యాలయం ఇచ్చారన్నారు. తాడేపల్లిగూడెం జిల్లాకు ముఖద్వారంగా ఉందని, ఇలాంటి ప్రాంతంలో డీఎస్పీ కార్యాలయం అవసరం ఉందన్నారు. రోడ్డు,రైలు మార్గాలను అనుసంధానం చేయగల ఏకైక పట్టణం తాడేపల్లిగూడెం అన్నారు. 2004లో తాను తొలిసారి ఎమ్మెల్యేగా అయ్యే సమయానికి తాడేపల్లిగూడెం అరాచకశక్తులకు అడ్డాగా ఉండేదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అరాచకశక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేశామన్నారు. ప్రస్తుతం జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి ఎస్పీ రవిప్రకాష్ సారథ్యంలో అదుపులో ఉందన్నారు. ఆర్డీఓ కార్యాలయాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. తాడేపల్లిగూడెం అభివృద్ధికి అన్నిరకాలుగా దృష్టి సారించామన్నారు. ఎస్పీ యు.రవి ప్రకాష్, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ సి.శరత్‌రాజ్‌కుమార్, సీఐలు ఎస్ఎస్‌వీ నాగరాజు, ఎస్వీ వీఎస్ మూర్తి, ఆంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన శని చంద్రబాబు

పెంటపాడు: రాష్ట్రానికి పట్టిన శనిగ్రహం చంద్రబాబునాయుడని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయన విమర్శించారు. మండలంలోని మీనవిల్లూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు పేదలను దోచుకున్నారని, పోలవరం ప్రాజెక్టు పనుల కోసం కేంద్రంతో కుమ్మక్కయ్యాడని మండిపడ్డారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు పేరుతో ప్రత్యేక హోదాకు చంద్రబాబు తూట్లు పొడిచాడన్నారు. చంద్రబాబును ఇంటికి పరిమితం చేస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారని, కాఫర్ డ్యాం తదితర పనులు పూర్తిచేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తున్నారని, నూరు శాతం హామీలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలతో పవన్ కల్యాణ్ గ్రాఫ్ పడిపోయిందన్నారు. చంద్రబాబు స్క్రిప్టును చదువుతున్నాడని ఎద్దేవా చేశారు.

ఆంధ్రా సుగర్స్‌కు సుగర్ కేన్ హార్వెస్టింగ్ మెషిన్ పేటెంట్



భారత ప్రభుత్వం జారీ చేసిన పేటెంట్ సర్టిఫికెట్

తణుకు: పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని ఆంధ్రా సుగర్స్ సంస్థ జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది. 20 ఏళ్ల కాల వ్యవధికి గాను ఆంధ్రా సుగర్స్‌కు హార్వెస్టింగ్ మెషిన్ పేరుతో తమ ఆవిష్కరణకు సుగర్ కేన్ పేటెంట్ మంజూరు చేసింది. ఈ మేరకు భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం ఈ నెల 26న పేటెంట్ సర్టిఫికెట్ జారీ చేసింది. సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్ మార్గదర్శకత్వంలో సంస్థకు చెందిన సుగర్ కేన్ హార్వెస్టర్ డెవలప్‌మెంట్ టీం దీనిని నిర్మించడం, ఉపయోగించడం కోసం పదేళ్లుగా అంకిత భావంతో కృషి చేస్తోంది. భారతీయ వ్యవసాయ పరిస్థితులకు అనువైన చెరకు హార్వెస్టర్ ఆవిష్కరణకు పేటెంట్ మంజూరు అయిన సంస్థ దేశంలోనే మొదటిది ఆంధ్రా సుగర్స్ కావడం విశేషం.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

మంత్రి కారుమూరి, చీఫ్ విప్ ముదునూరి



తణుకు టౌన్: దువ్వలో మొక్క నాటుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



మొగల్తూరు: కొత్తోటలో మొక్క నాటుతున్న చీఫ్ విప్ ముదునూరి



కాళ్ల: పెదఅమిరంలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ ప్రశాంతి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

తణుకు టౌన్: భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మండలంలోని దువ్వలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన మాస్ ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిందన్నారు. తణుకు మండలంలో 2,800 మొక్కలను నాటుతున్నట్టు చెప్పారు. పంచాయతీలకు ఆదాయం వచ్చేలా 2,060 కొబ్బరి మొక్కలు నాటుతున్నారన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, ఎంపీపీ రుద్ర ధనరాజు, సర్పంచ్ అడ్డా బాబు, ఉప సర్పంచ్ కడియం వీరబాబు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు జీకే రాజు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

మొగల్తూరు: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అందించిన మొక్కలను శుక్రవారం మండలంలోని అన్ని సచివాలయాల ఆవరణలో నాటారు. కొత్తోట, పాతపాడులో ఆయన మొక్కలు నాటి మాట్లాడుతూ మొక్కల సంరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, ఎంపీటీసీ సభ్యులు లింగం ఏసుబాబు, డీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

50 వేల మొక్కలు నాటేలా ప్రణాళిక

కాళ్ల: జిల్లావ్యాప్తంగా తొలిరోజు 50 వేల మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మండలంలోని పెదఅమిరం గ్రామంలో ఐఏఎస్ అధికారుల సతీమణుల సంఘం ఆధ్వర్యంలో జేసీ రామసుందర్‌రెడ్డి సతీమణి ప్రసన్న కలిసి ఆమె మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. హరిత పశ్చిమగోదావరి దిశగా కృషి చేస్తున్నామన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రసన్న కుమారి



ఉంగుటూరు : వంద రోజుల్లో 50 వేల బియ్యం గింజలపై శ్రీరామ నామాన్ని రాసినందుకు అభినందిస్తూ కైకరం గ్రామానికి చెందిన కూన ధనలక్ష్మి ప్రసన్న కుమారికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రం, మెడల్ బ్యాడ్జిని అందచేసింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలు పబ్లిక్ హాలిడేస్, రెండో శనివారం, ఆదివారాలు విద్యార్థులకు ఎలాంటి తరగతులు నిర్వహించరాదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే చంద్రశేఖర బాబు ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యామండలి ఆదేశాలను విధిగా పాటించాలని, నిబంధనలు పాటించకపోతే అలాంటి యాజమాన్యంపై తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవు దినాల్లో కళాశాలకు హాజరు కావాలని కళాశాల యాజమాన్యం విద్యార్థులపై గానీ లేదా తల్లిదండ్రుల మీద గానీ ఎలాంటి ఒత్తిడి చేయరాదని సూచించారు. విద్యార్థులు సెలవు దినాల్లో హాజరు కాలేదని విద్యార్థులపై గానీ తల్లిదండ్రుల పైగానీ ఎటువంటి చర్యలు తీసుకున్నా ఆ కళాశాల యాజమాన్యాలపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పాపికొండల్లో పెద్దపులులు

నేడు అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం

- నాలుగు పులులు, ఐదు చిరుతలు ఉన్నట్లు గుర్తింపు
- ప్రభుత్వ చర్యలు, ప్రజల్లో చైతన్యంతో స్వేచ్ఛగా సంచరిస్తున్న వైనం



బుట్టాయగూడెం: పులి గాండ్రింపులతో అడవి తల్లి పులకిస్తోంది. జీవవైవిధ్యం పరిమళిస్తోంది. నడకలో రాజసం, వేటలో గాంభీర్యంతో అడవికి రారాజుగా వెలుగొందే పెద్ద పులుల సంఖ్య రాష్ట్రంలో పెరుగుతుంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ప్రజల్లో అవగాహన వెరసి పెద్ద పులుల సంఖ్య పెరిగింది. ఏలూరు జిల్లా పాపికొండలు అభయారణ్యం పరిధిలో మరిన్ని పులుల కదలికలు గుర్తించారు. అభయారణ్యంలో సుమారు నాలుగుకు పైగా పులులు, ఐదు పైగా చిరుతలు ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు.

ట్రాప్ కెమెరాకు చిక్కిన పులులు, చిరుతలు

పాపికొండల అభయారణ్యం ఏలూరు, అల్లూరి, భద్రాది జిల్లాల అటవీ ప్రాంతాల మధ్య ఉంది. మొదట్లో 590 హెక్టార్ల పరిధిలో ఉన్న అటవీ ప్రాంతం మాత్రమే రిజర్వ్ ఫారెస్టుగా ఉండేది. 2008లో ఈ ప్రాంతాన్ని వన్యప్రాణి సంరక్షణ కోసం అభయారణ్య ప్రాంతంగా గుర్తించారు. ఈ అభయారణ్యాన్ని జాతీయ పార్క్‌గా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మూడు జిల్లాల పరిధిలో అటవీ ప్రాంతాల మధ్య 1,12,500 హెక్టార్లకు ఈ అభయారణ్యాన్ని పెంచిన కేంద్ర ప్రభుత్వం దీనిని జాతీయ పార్క్‌గా మార్చాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి ఈ అభయారణ్యంతో పాటు జంతు సంరక్షణపై ప్రభుత్వం, ఫారెస్టు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అడవి తల్లి ఒడిలో గాండ్రింపులతో పులులు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. 2014లో అటవీ శాఖ అధికారులు పులులు సంచరిస్తున్నట్లు గుర్తించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని తెల్ల దిబ్బలు తదితర ప్రాంతాల్లో రాత్రి వేళ పులి గాండ్రింపులు విన్నట్లు ఆ ప్రాంత ప్రజలు చెబున్నారు.

నవంబర్–ఏప్రిల్ మధ్య పునరుత్పత్తి

పెద్ద పులి 18 నుంచి 20 సంవత్సరాలు బతుకుతుంది. పులి పిల్లలు తల్లి నుంచి మూడు నుంచి నాలుగు సంవత్సరాల వరకూ వేట, ఈత నేర్చుకుంటాయి. మగ పులి నాలుగేళ్ల తర్వాత తల్లి నుంచి వేరైపోతుంది. ఆడ పులి మాత్రం తల్లి దగ్గరే ఉంటుంది. ఆడ పులి గర్భం దాల్చిన 93 నుంచి 113 రోజుల్లో ప్రసవిస్తుంది. అడవిలో పెద్ద పులి ప్రతీ రోజూ 25 కిలోమీటర్ల దూరం వరకూ తిరుగుతుంది. చెట్ల మొదళ్లలో గోళ్లతో గీరి మూత్రం పోసి గుర్తు పెట్టుకుంటుంది. సాధారణంగా నవంబర్- ఏప్రిల్ మధ్య పులుల పునరుత్పత్తి ఎక్కువగా ఉంటుంది. ఆడ పులి కలయికకు కొన్ని రోజులు మాత్రమే అనుకూలంగా ఉంటుంది. గర్భధారణ సమయం 16 వారాలు ఉంటుంది.





పాపికొండల అభయారణ్యంలో ట్రాప్ కెమెరాలకు చిక్కిన పెద్ద పులి, చిరుతలు

ఒంటరిగానే జీవనం

పులి సంచరించే ప్రాంతాన్ని పెద్ద పులి టెరిటరీగా భావిస్తారు. ఆడ పులి తన నివాస స్థావరాన్ని సుమారు 20 చదరపు కిలోమీటర్ల మేర ఎంచుకుంటుంది. మగ పులి 60 నుంచి 100 చదరపు కిలోమీటర్లు వరకు ఉండేలా తన నివాస స్థావరాన్ని ఎంచుకుంటుంది. ఇవి జీవించే ప్రాంతాల్లోకి తనకు హాని కలిగించే మరే ఇతర జంతువు కూడా ప్రవేశించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాయి.

2022లో పులుల గణన

2009–10 మధ్య కాలంలో బుట్టాయగూడెం మండలం ఇనుమూరు, చింతలగూడెం, అంతర్వేదిగూడెం అటవీ ప్రాంతంలో పులుల అడుగులను ఫారెస్టు అధికారులు గుర్తించారు. పశువులపై పులి దాడి చేసిన సంఘటనలు జరిగాయి. 2019లో పులులు సంచరిస్తున్నట్లు గుర్తించిన ఫారెస్టు అధికారులు అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. 2022లో చేసిన పులుల గణన కార్యక్రమంలో పులుల జాడ ట్రాప్ కెమెరాకు చిక్కాయి.

పులుల సంరక్షణ అందరి బాధ్యత

జీవ వైవిధ్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులుల్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పులులు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మనిషి దురాశకు పులులు బలైపోతున్నాయని వరల్డ్ వైల్డ్ లైఫ్ గణంకాలు చెబుతున్నాయి. పులులను కాపాడుకునేందుకు అవి సంచరించే అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు 2010 నుంచి ప్రతీ ఏటా జూలై 29న వరల్డ్ టైగర్స్‌డే నిర్వహిస్తున్నారు.

గూడెం రెవెన్యూ డివిజన్‌కు కొత్త పోస్టులు

తాడేపల్లిగూడెం: కొత్తగా ఏర్పడిన తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌కు 17 పోస్టులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీఓ విడుదల చేసింది. సబ్ కలెక్టర్ లేదా ఆర్డీఓ ఒకరు, డివిజినల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఒకరు, డిప్యూటీ తహసీల్దార్‌లు ముగ్గురు, సీనియర్ అసిస్టెంట్లు ముగ్గురు, జూనియర్ అసిస్టెంట్ ఒకరు, టైపిస్టు కం కంప్యూటర్ ఆపరేటర్ ఒకరు, రికార్డు అసిస్టెంట్ ఒకరు, ఆఫీస్ సబార్డినేట్‌లు ఇద్దరు, డ్రైవర్ ఒకరు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఒకరు, చైన్‌మెన్ ఒకరు, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఒకరికి అనుమతి ఇచ్చారు.

పోక్సో కేసు నమోదు

ఉండి: బాలికను లైంగిక వేధింపులకు గురి చేసిన ఘటనలో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పాందువ్వ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన గులిపల్లి వెంకటేష్ ఈ నెల 28న ఉదయం 9 గంటలకు ఆమె ఇంట్లోకి వెళ్లి చేయిపట్టుకుని వేధింపులకు గురి చేశాడు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధరరావు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

సాక్షి, భీమవరం: భీమవరం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కొవ్వాడ పుంతలో అనుమానాస్పద స్థితిలో బాలిక మృతిచెందినట్లు టూటౌన్ ఎస్సై అప్పారావు చెప్పారు. కొవ్వాడ పుంతకు చెందిన బొండాడ మధురకృష్ణ కుమార్తె బొండాడ అమృతవర్షిణి(16) గురువారం రాత్రి ఇంటిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని మరణించిందని, మృతురాలి నాన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గడపగడపకు సంక్షేమం



పెంటపాడు: మండలంలోని మీనవల్లూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



పాలకోడేరు : విస్సాకోడేరులో ఇంటింటికి తిరిగి బ్రోచర్లు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

హుండీలో నగదు చోరీ



మొగల్తూరు లాకు వద్ద వినాయకుడి ఆలయంలో పగులగొట్టిన హుండీ

మొగల్తూరు : మొగల్తూరులోని లాకు వద్ద ఉన్న వినాయకుడి ఆలయంలోను, కుక్కలవారితోటలోని చెట్టుకింద ముత్యాలమ్మ ఆలయంలోని హుండీలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టేందుకు ప్రయత్నించారు. చెట్టుకింద ముత్యాలమ్మ ఆలయ హుండీ తెరుచుకోకపోగా, వినాయకుని ఆలయంలోని హుండీ తలుపులు పగలగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి ఆలయ నిర్వాహకులకు సమాచారం అందించగా హుండీలోని నగదు దొంగిలించినట్లు గుర్తించారు. ఆలయ నిర్వాహకులు మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కవితల పోటీల్లో ప్రథమ బహుమతి

పాలకొల్లు సెంట్రల్ : విశాఖపట్నంకు చెందిన సాహితీ ప్రవంతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి అభ్యుదయ మినీ కవితల పోటీల్లో పట్టణానికి చెందిన రసధుని సాహితి సంస్థ సహాయ కార్యదర్శి, కవి మామిడిశెట్టి శ్రీనివాసరావుకు ప్రథమ బహుమతి లభించింది. రెండు రోజులు క్రితం విశాఖపట్నంలో ఈ పోటీలు జరిగాయి. శ్రీనివాసరావు మాట్లాడుతూ పెనుగాలులకు అతలాకుతలమైన రైతు దుర్భరస్థితిని వర్ణిస్తూ.. సేద్యపు మడులలో స్వేదనదులై ప్రవహించి ఈ దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఆకలి కేకల బారి నుంచి కాపాడి వాడి ఆకుపచ్చని కలను నిజం చేద్దాం అంటూ సాగిన కవిత అన్నారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

ఆకివీడు: ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు దొంగతనానికి ప్రయత్నించిన ఘటన పెదకాపవరం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. సచివాలయం సమీపంలో ఉంటున్న వృద్ధురాలు కఠారి రమణమ్మ తెల్లవారుజామున లేచి బయటకు వచ్చిన సమయంలో ఆమె మెడలో చైన్ లాగేందుకు యువకుడు ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో రాయితో ఆమె తలపై కొట్టి గాయపరచాడు. ఆమె బంగారు గొలుసును గట్టిగా పట్టుకొని కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వస్తున్నట్లు తెలుసుకుని ఆ యువకుడు పరారయ్యాడు. గాయపడిన వృద్ధురాలికి స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.11 లక్షల మేర మోసం

పాలకోడేరు: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేశారంటూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన ధంపనబోయిన శ్రీనివాస కృష్ణ అయ్యప్పన్ భార్య, తల్లి, తండ్రిలు దగ్గర బంధువులైన పాలకోడేరు గరువుకు చెందిన మల్లుల వీర వెంకట పార్వతి, భర్త లక్ష్మీ శ్రీనివాస్‌ను కలిసి కాణిపాకం దేవస్థానంలో అటెండర్ పోస్టులు ఉన్నాయని ఇప్పిస్తామని చెప్పి రూ.11 లక్షల తీసుకుని మోసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డెక్కిన వేల్పూరు 'పంచాయితీ'

టీడీపీలో పెరుగుతున్న అసమ్మతి రాగం



వేల్పూరులో నిరసన దీక్షలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తణుకు: తణుకు మండలం వేల్పూరు పంచాయతీ వ్యవహారం రోడ్డెక్కింది. తెలుగు దేశం పార్టీ బలపరిచిన పంచాయతీ పాలకవర్గం చేస్తున్న అక్రమాలు, అవినీతి సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. ఈనెల 27న 'కొటేషన్లు పెంచేసి... అడ్డంగా బొక్కేసి!' శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనంతో ఈ వ్యవహారం రోడ్డున పడింది. ఇప్పటికే పంచాయతీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు విచారణ చేపడుతుండగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం నుంచి గ్రామంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలతో మరింత రాజుకుంది. పాలకవర్గం పగ్గాలు చేపట్టిన నాటి నుంచి తెలుగుదేశం పార్టీలోని కొందరు నాయకులు పంచాయతీలో చొరబడి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గత ప్రత్యేక అధికారి పాలనలో గ్రామంలో వివిధ సామాజిక వర్గాలకు కేటాయించిన సామాజిక భవనాల నిర్మాణాలు అడ్డుకున్న పంచాయతీ పాలకవర్గం కోర్టును ఆశ్రయించడంతో వివాదం ముదిరింది. ఆయా సామాజిక వర్గాలకు చెందిన గ్రామస్తులు టీడీపీ నేతలు చేస్తున్న వ్యవహారంపై పెదవి విరుస్తున్నారు. దీంతో టీడీపీ నాయకులు జరిగిన నష్టాన్ని పూడ్చుకునే పనిలో పడ్డారు. వేల్పూరు పంచాయతీలో 18 వార్డులు ఉండగా 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం బలపర్చిన 11 మంది సభ్యులు విజయం సాధించగా వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఏడుగురు సభ్యులు గెలుపొందారు. దీంతో విశ్వనాథం కృష్ణవేణి సర్పంచిగా బాధ్యతలు చేపట్టారు. ఆమె సర్పంచిగా వ్యవహరిస్తున్నప్పటికీ పంచాయతీ వ్యవహారాలన్నీ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులే చూస్తున్నారు. ఇదిలా ఉంటే పంచాయతీ బోర్డు ఏర్పాటు చేసిన నాటి నుంచి తెలుగుదేశం శ్రేణులు వ్యవహరిస్తున్న తీరుతో విసుగెత్తిపోతున్న అదే పార్టీలోని వార్డు సభ్యులు అసమ్మతి రాగం అందుకున్నారు. ఇటీవల నాలుగో వార్డు సభ్యురాలు రమాదేవి పంచాయతీలో జరుగుతున్న వ్యవహారంపై బహిరంగంగా విమర్శిస్తూ విడుదల చేసిన వాయిస్ మెసేజ్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పంచాయతీ వ్యవహారాల్లో టీడీపీ నేతలు జోక్యం పెరుగుతోందని.. దీనిపై పార్టీ పెద్దలు దృష్టి సారించాలని పేర్కొంటూ ఆమె విడుదల చేసిన వాయిస్ మెసేజ్ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

సంక్షేమానికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలతో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు అండగా నిలుస్తున్నారని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు పాతవూరుకు చెందిన వివిధ పార్టీలకు చెందిన మహిళలు శుక్రవారం దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు మనుబర్తి లలిత ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాలకు సమానంగా అందుతున్న సంక్షేమానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారని అన్నారు. పార్టీని నమ్మిన వారికి పార్టీ ఎప్పుడూ అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కుటుంబంలో చేరిన ప్రతి మహిళ తమ ప్రాంతంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని సూచించారు. జగనన్న అందిస్తున్న సంక్షేమంతో రాష్ట్రంలో పేదరికం తగ్గుతుందని కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం మిగిలిన రాష్ట్రాల కన్నా తక్కువగా ఉందన్నారు. జగనన్న ఆలోచనలకు అనుగుణంగా పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని కోరారు. ఎలాంటి అవసరమున్నా తనను నేరుగా కలవాలని కోరారు. ముందుగా పార్టీలో చేరిన మహిళలకు మంత్రి కారుమూరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, అత్తిలి మండల మహిళాధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, సామంతుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కావాలంటే నిత్య విద్యార్థిగా ఉండాలి

ఉండ్రాజవరం: డాక్టర్ కోర్సు చదవాలంటే చదువుతో పాటు క్రమశిక్షణ, ధైర్యం కావాలని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. నీట్–2023లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వేలివెన్ను శశి ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏటా తమ విద్యా సంస్థ నుంచి 200 మందికి తగ్గకుండా మెడికల్ సీట్లు సాధిస్తున్నారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం కూడా 300 సీట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ కోరుకొండ బాబ్జీ, వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ జాయింట్ రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు, సాగర్ హస్పిటల్ వైద్యుడు పి.రవికిరణ్, శశి అకాడమిక్ డైరెక్టర్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రంలో దుకాణాల నిర్వహణకు వేలం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ తూర్పు ప్రాంతంలోని పలు దుకాణాలను లీజుకు ఇచ్చేందుకు ఆలయ అధికారులు స్వామివారి కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం బహిరంగ వేలం పాట నిర్వహించారు. రెండేళ్ల కాలపరిమితికి జరిపిన ఈ వేలం పాటల ద్వారా స్వామికి విశేష ఆదాయం సమకూరింది. అందులో భాగంగా షాపు నెంబర్ 10లో కూల్ డ్రింక్స్ షాప్ నిర్వహణకు వెజ్జు సత్యవాణి (చంద్రశేఖర్) నెలకు రూ.1.42 లక్షలకు హెచ్చుపాట పాడారు. గతేడాదితో పోలిస్తే దేవస్థానానికి ఈ షాపు ద్వారా నెలకు రూ.68,300 ఆదాయం పెరిగింది. షాపు నెంబర్ 11లో ఫ్యాన్సీ, జనరల్ ఐటమ్స్ విక్రయించుకునేందుకు పాదిలి నాగేశ్వర కుమార్ నెలకు రూ.1.55 లక్షలకు హెచ్చుపాట పాడారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి ఈ షాపుకు రూ.71,400 పెరిగింది. షాపు నెంబర్ 19లో అవే ఐటమ్స్ విక్రయించుకునేందుకు కోరుప్రోలు సత్యనారాయణ నెలకు రూ.1.10 లక్షలకు హెచ్చు పాట పాడారు. దీని ద్వారా గతేడాది కంటే ఈసారి రూ.37,400 ఆదాయం పెరిగింది. షాపు నెంబర్ 20లో ఫ్యాన్సీ ఐటమ్స్ విక్రయించుకునేందుకు కోరుప్రోలు సూరిబాబు నెలకు రూ. 1.15 లక్షలకు హెచ్చుపాట పాడారు. గతేడాది కంటే రూ.46,800 పెరిగింది. షాపు నెంబర్ 23లో అవే ఐటమ్స్ విక్రయించుకునేందుకు మహంకాళి సర్వేశ్వరరావు నెలకు రూ. 2.16 లక్షలకు సీల్డ్ టెండర్ వేసి, పాటను దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈసారి రూ. 22,400 పెరిగింది. షాపు నెంబర్ 24లో అవే ఐటమ్స్ విక్రయించుకునేందుకు వీసం నాగరాజు నెలకు రూ. 1.80 లక్షలకు హెచ్చుపాట పాడారు. గతేడాది కంటే రూ.11,087 పెరిగింది.

వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ ఉపకరణాలు, కనెక్షన్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలను పర్యవేక్షించడానికి జిల్లా కేంద్రాలలో ఉన్న సూపరింటెండింగ్ ఇంజినీర్ల కార్యాలయాలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నియంత్రణలో ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నంబర్ 1912కు అదనంగా ఈ కేంద్రాలు పనిచేస్తాయని వివరించారు. తుపాను లేదా భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలకు సంబంధించిన మరమ్మతు పనులు పూర్తయ్యేంత వరకూ నిరంతరం ఈ పర్యవేక్షణ కేంద్రాలు పనిచేస్తాయని సీఎండీ స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, ఇతర సరఫరా సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు వివిధ సర్కిళ్ల పరిధిలో ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని విద్యుత్ వినియోగదారులకు సీఎండీ సూచించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్ నెంబరు 9440812702 లో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేయాలని మంత్రికి వినతి



అత్తిలిలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకి వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా నాయకులు

అత్తిలి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేయాలని జిల్లా అధ్యక్షుడు తేలి శాంతి స్వరూప్ శుక్రవారం మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాంతి స్వరూప్ మాట్లాడుతూ గత 14ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారని, వారి సేవలను గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గ్రామసచివాలయం, ఆర్బీకే, సిమెంట్‌రోడ్ల నిర్మాణం తదితర కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను గుర్తించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేష్, మహేష్, పిల్లి ఏసురత్నం, వి వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి, అనిత, సూర్యకోటి, జైల్‌సింగ్, బాబు పాల్గొన్నారు.

మంచిలిలో పొలం బడి



మంచిలిలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాజేష్

అత్తిలి: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి, సాగు చేయడం ద్వారా వ్యయం తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం మంచిలి గ్రామంలో పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రైతులకు బ్యాలెట్ పేపర్ పరీక్ష నిర్వహించారు. రైతులు అడిగిన పలు సందేహాలను వ్యవసాయశాఖ అధికారి నివృత్తి చేసి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రిక, కృష్ణ, శిరీష, రైతులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి చేలు



యనమదుర్రులో నీట మునిగిన వరి చేలు

పెంటపాడు: గత నాలుగురోజుల నుంచి ఎగువ ప్రాంతంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల వల్ల కొండేపాడు, మీనవిల్లూరు గ్రామాల వద్ద యనమదుర్రు డ్రెయిన్ పొంగి ప్రవహిస్తోంది. ఈ ప్రభావం వల్ల కొండేపాడులో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పాతవయ్యేరు డ్రెయిన్‌కు ఆనుకొని ఉన్న సుమారు 10 ఎకరాల వరి నాట్లు వేసిన పొలాలు నీట మునిగాయి. కాగా వర్షాలు కురవక పోయినా డ్రెయిన్ ఉధృతి మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఇసుక, మట్టి బస్తాలను వేసేందుకు సిద్ధపడుతున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి

తాడేపల్లిగూడెం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్ అన్నారు. ఐఎఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఆరుగొలను, కొత్తూరు, కృష్ణాయపాలెం గ్రామాల్లోని అమృత్ సరోవర్ చెరువుల చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో ప్రసాద్ మాట్లాడుతూ కాలుష్య నివారణలో మొక్కలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూడవల్లి హనుమంతరావు, నాయకులు నక్కా గంగాధర్, కంఠమని సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఉప్పు విజయలక్ష్మి, అప్పారావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు సహకరించాలి

తణుకు: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని తణుకు ట్రాఫిక్ ఎస్సై జానా సతీష్ కోరారు. శుక్రవారం తణుకు పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ప్రమాదాల నివారణ, హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా తలకు గాయం కావడం వల్లనే మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని కోరారు. ఎస్సైలు ఆర్.బెన్నిరాజు, హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



ఇరగవరం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కొప్పి శెట్టి అలివేలు మంగతాయారు అధ్యక్షతన మండలంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో అవినీతి పెద్ద ఎత్తున జరిగిందన్నారు. ఎంఈవో ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాడు- నేడు, జగనన్న విద్యా దీవెన, మధ్యాహ్నం భోజనం పథకం పలు పథకాల పనితీరును వివరించారు. అనంతరం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మాస్ ప్లానిటేషన్-అవెన్యూ ప్లానిటేషన్ కార్యక్రమంలో బాగంగా మంత్రి మొక్కలు నాటారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంతో గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీడీవో ఎ శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

అత్తిలి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో అత్తిలి గ్రామంలో శుక్రవారం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా భావితరాల వారికి మంచి ఆరోగ్యాన్ని, వాతావరణాన్ని ఇచ్చినవారం అవుతామన్నారు. అందరూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతు కృషి చేసి ఆహ్లాదకరమైన మంచి వాతావరణాన్ని అందిద్దామని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హితవు పలికారు. రోడ్డు వెంబడి ఉన్న స్థలంలో కొబ్బరి, జామ, నిమ్మ, సపోటా వంటి మొక్కలను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చిన్నారులతో కలిసి నాటారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, సర్పంచ్ గంటావిజేతనాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, కంకటాల సతీష్, కాసగాని అబ్బులు, కోరుకొల్లు వెంకట్రావు, సబ్బితి రాజేస్, ఆకుల చినబాబు, రంభ రాంబాబు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అత్తిలిలో మొక్కలు నాటుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం




13వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలో 13వ వార్డులో బేబి సెంటర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో హెల్త్ సిబ్బందిచే 50వ విడత ఫీవర్ సర్వేలు జరిగాయి. అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో డెంగ్యూ నివారణ మాసోత్సవాలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలను అరికట్టేందుకు తప్పనిసరిగా దోమతెరలను వాడాలన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు శారద, జ్యోతి, ఆశ కార్యకర్త అనురాధ, వలంటీర్లు, శానిటేషన్ కార్యదర్శులు, ఆరోగ్య సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి

- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ
- మీనవిల్లూరులో గడపగడపకు మన ప్రభుత్వం



పెంటపాడు మండలంలోని మీనవిల్లూరు గ్రామంలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. మీనవిల్లూరు గ్రామంలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయత్రం ఆయన ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ఆరా తీసారు. అనంతరం ప్రజలతో మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రచారాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ అభివృద్ధిని మరిచిన చంద్రబాబు జగనన్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. గడిచిన ఐదేళ్ల అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో విచ్చలవిడి దోపిడీకి పాల్పడిందని విమర్శించారు. ఈ విషయం పవన్ ప్రశ్నించకపోవడం విచారమన్నారు. 2014లో ఎన్నికల్లో ఐదేళ్ల పవన్ చంద్రబాబుతో కుమ్మక్కై జనసేన నేత పవన్ ప్రశ్నించేతత్వాన్ని విడనాడి అమ్ముడుపోయారన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉండటం చంద్రబాబుకు నచ్చడం లేదని ఆరోపించారు. జగన్‌కు వస్తున్న ఆధరణ చూసి ఓర్వలేక వైసీపీ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధానంగా రాక్షస అంశగా ఉన్న చంద్రబాబు కడుపుమంటను తక్షణం తగ్గించుకోవాలన్నారు. ఎంతో కాలం నుంచి మరమ్మతులు లేక శిథిలమైన అత్తిలి-అలంపురం రోడ్డుకు రూ.5కోట్లు నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి లక్ష్మి, పార్టీ బీసీ సంఘ నాయకులు చింతపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు దేవికారాణి, వెంకటేశ్వర్లు, కొండ్రెడ్డి సత్యనారాయణ, పార్టీ నాయకులు సంకురాత్రి సత్యనారాయణ, నిల్లా నాగమల్లయ్య, చల్లా లింగమూర్తి, చల్లా కుమారస్వామి, పాలా గణపతి, మర్రే కృష్ణమూర్తి, దేవరశెట్టి రాంబాబు, మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి హైమావతి, ఉపాధ్యక్షురాలు మార్లపూడి సరోజిని, గుండుమోగుల సాంబయ్య, మైలవరపు పెదబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కై గాల శ్రీనివాసరావు, ముదునూరు, రావిపాడు సొసైటీ అధ్యక్షులు బూరాడ శ్రీనివాసరావు, దేవ వెంకటరమణ, ములగాల రామసత్యనారాయణ దాట్ల రామలింగరాజు, దేవరశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ అందరి బాధ్యత



తాడేపల్లిగూడెం మండలంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల నివారణ అందరి బాధ్యత అని మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కుంచనపల్లి, ముత్యాలంబపురం గ్రామాల్లో డ్రై డే, ఫ్రైడే, కీటక జనీత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో అపారిశుధ్య వాతావరణం ఉండరాదన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెంది వ్యాధులను కలుగజేస్తాయని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో దోమ తెరలను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు జ్యోతి, రత్నకుమారి, ఆశా కార్యకర్త అనూరాధ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, రమేష్, రాధాకృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

విజయవాడ సదస్సును జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటియు నాయకులు చిర్ల పుల్లారెడ్డి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక, కర్షకుల సమస్యలపై ఈనెల 30వ తేదీన విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరగనున్న సదస్సు జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం రైల్వే గూడ్స్‌షెడ్డువద్ద వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు సత్తి కోదండ రామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డిలు మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను మార్పు చేశారని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లుకు అప్పగించేందుకు నల్ల చట్టాలను తీసుకువచ్చారని విమర్శించారు. 70 శాతం ఉన్న కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వలేదని, వ్యవసాయం గిట్టుబాటు అవ్వక ఆత్మహత్యలు చేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలపై భవిష్యత్తు కార్యాచరణ జరుగుతుందని, విజయవాడ సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ రెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, గాది వెంకట్రావు, అడప ఆంజనేయులు, నారాయణ, పుత్రయ్య, నాని పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై నిరసనలు



తణుకులో మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ నిర్వహించిన దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు

తణుకు అర్బన్: మణిపూర్ ఘటన బాధితులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు మనుబర్తి లలిత అన్నారు. మణిపూర్ ఘటనకు నిరసనగా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తణుకులో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మణిపూర్ ఘటన్ యావత్ ప్రపంచాన్ని కలచివేసిందని, ఘటనను బయట ప్రపంచానికి కనిపించకుండా ఉండేందుకు తీసుకున్న జాగ్రత్త అటువంటి ఘటనలు జరగకుండా చూడడంలో లోపించాయని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి రోడ్డులో శాంతి ర్యాలీ నిర్వహించి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఝాన్సీ లారెన్స్, కొలగాని కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలను ఖండించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పెద్ద మసీద్ అనఫియా ముస్లిం పెద్దలు, సభ్యులు పేర్కొన్నారు. మసీద్ వద్ద శుక్రవారం మత ప్రార్ధనలు అనంతరం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న ధన మాన ప్రాణాలకు, మారణహోమానికి, పౌర హక్కుల విఘాతానికి అక్కడ రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ రఫాత్, కార్యదర్శి సర్దార్‌ఖాన్, రిజ్వాన్, రఫి, మహబూబ్ బాషా, వలిబాషా, ముజాహిద్, బాబర్, ఆటోవలి, నౌషాద్ మోహిద్దీన్, ఖాన్‌బాష, సిరాజుద్దీన్, సర్తాజ్ తదితరులు మాట్లాడారు. ముస్లిం సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



భవిత కేంద్రంలో మొక్కలు పంపిణీ చేస్తున్న మహిళా వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల కేంద్రంలోని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, స్థానికులకు ప్రకృతి పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళా వాకర్స్‌చే మొక్కలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని కోరారు. చెట్లు నరకడం మానివేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని మానాలని, గుడ్డ సంచులను వాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, మహిళా సభ్యులు ఉదయకుమారి, కనకదుర్గ, ప్రభావతి, ఇందిరా కుమారి, రామలక్ష్మి, అరుణ కుమారి, నాగ సౌభాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో అన్ని వర్గాలకూ న్యాయం



తణుకులో వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారిని సత్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పార్టీలో అన్ని వర్గాలకూ న్యాయం చేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల ప్రకారమే నాయకులు, కార్యకర్తలకు పదవులు అందిస్తున్నానని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పార్టీ నాయకులు కర్రి గంగాధర అప్పారావు, ఆర్తమూరి మణికంఠరెడ్డిలను తణుకు పట్టణ ఉపాధ్యక్షులుగా నియమించి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ పదవులు బాధ్యతలను పెంచుతాయని వాటికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ జేసీఎస్ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, నత్త కృష్ణవేణి, సప్పా బలరామకృష్ణ పాల్గొన్నారు.

వర్గీకరణపై మౌనం వహించడం సరికాదు



కడియద్దలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ వర్గీకరణ హామీపై బీజేపీ మౌనం వహించడం సరికాదని, మాదిగలను మోసం చేయడమేనని మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకుడు విస్సంపల్లి సిద్దూ అన్నారు. మండలంలోని కడియద్ద గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ గ్రామ సభ మండల కార్యదర్శి పెదముత్తి రాజేంద్ర అధ్యక్షతన గురువారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా సిద్దూ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తానని హామీనిచ్చి తొమ్మిదేళ్లు గడుస్తుందన్నారు. నేటికీ హామీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు రెండో వారంలో 30లక్షల మందితో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ప్రజాస్వామికవాదులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు బైపే ఏసుపాదం, ఉపాధ్యక్షుడు నేకూరి రాజేష్, కార్యదర్శి శ్రీను, సంయుక్త కార్యదర్శిగెడ్డం వంశీ, ఎంఎస్‌పీ అధ్యక్షుడు కంకిపాటి ఆనందరావు, ఉపాధ్యక్షుడు నేకూరి పాలు, కార్యదర్శి నందిగం సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కె. పెంటపాడులో గడపగడపకు కార్యక్రమం

పెంటపాడు: గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం శనివారం సాయంత్రం కె. పెంటపాడులో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, పార్టీ నాయకులు మేడపురెడ్డి బొమ్మినాయుడులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు హాజరు కావాలని తెలిపారు.

రేపు తణుకులో క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ

తణుకు: మణిపూర్‌లో శాంతి కోసం తణుకు నియోజకవర్గ క్రైస్తవ సంఘాలు ఆధ్వర్యంలో ఈనెల 30న తణుకులో శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు తణుకు మండల పాస్టర్స్ ఫెలోషిప్ వేదిక పిలుపునిచ్చింది. శుక్రవారం తణుకు టౌన్ లూథరన్ చర్చిలో యూసీ ఉపాధ్యక్షుడు పాస్టర్ లాజరస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. యూసీఏ అధ్యక్షుడు పాస్టర్ మనోజ్‌బాబ్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసను తీవ్రంగా ఖండిస్తూ ఆ రాష్ట్రంలో శాంతి నెలకొనాలని పేర్కొంటూ శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రైస్తవులు అధికంగా ఉన్న రాష్ట్ర మైనప్పటికీ లౌకిక దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రతిఒక్కరు ఖండించాలని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ ర్యాలీలో పాస్టర్లతోపాటు క్రైస్తవ విశ్వాసులు పాల్గొనాలని పిలుపిచ్చారు. టౌన్ లూథరన్ చర్చి నాయకులు పి.జయరాజు, డాక్టర్ పి.స్వరూప్‌దత్, పాస్టర్లు బ్లెస్సింగ్‌రాజు, డేవిడ్ బాబు, మర్రే అబ్రహాం, జాయ్, కృపావరం, జోసెఫ్, రాజారావు, యేసు, చుక్కా లివింగ్‌స్టన్, సామ్యూల్‌వేణు, అనిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

పంచాయతీ అక్రమాలపై నిరసనలు

రోడ్డెక్కిన వేల్పూరు పంచాయతీ వ్యవహారం



వేల్పూరులో టీడీపీ నాయకుల వేధింపులకు నిరసనగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న బీసీ కులాల నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

తణుకు టౌన్: తణుకు మండలం వేల్పూరు పంచాయతీ వ్యవహారం రోడ్డెక్కింది. తెలుగు దేశం పార్టీ బలపరిచిన పంచాయతీ పాలకవర్గం చేస్తున్న అక్రమాలు, అవినీతి సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పంచాయతీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు విచారణ చేపడుతుండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శుక్రవారం నుంచి గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలతో మరింత రాజకుంది. వేల్పూరులో బీసీ కులాలు తమ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం చేసిన ఖర్చుల డబ్బులను చెల్లించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు వైఎస్సార్‌సీపీ నాయకులు సంఘీబావం తెలిపారు. శుక్రవారం వేల్పూరులోని దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ సంఘీబావాన్ని తెలిపారు. ఈకార్యక్రమంలో వేల్పూరు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సున్న దుర్గా ప్రసాద్, తణుకు, ఇరగవరం, అత్తిలి మండల పార్టీ అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, కె దుర్గా ప్రసాద్, పైబోయిన సత్యనారాయణ, తణుకు పట్టణ అధ్యక్షుడు మంగిన సూర్య, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెనుమత్స రామరాజు, అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అబీబుద్దీన్, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బి భరణీప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు చుంద్రు శ్యామల, వైస్ ఎంపీపీ బొశెట్టి శేషుకుమారి, వేల్పూరు సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు రెడ్డి హైమా, వెంకటలక్ష్మీ, పట్టణ మహిళా అధ్యక్షురాలు నూకల కనకదుర్గ, జస్పాల్ పాల్గొన్నారు.

సీఎం జిల్లా వారైతే అనర్హులా!

సాక్షి, అమరావతి: విదేశీయులు మన దేశంలో కంపెనీలు, పరిశ్రమలు స్థాపిస్తున్నారు. మన రాష్ట్రం నుంచి ఎంతో మంది దేశ, విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ఆ ఊరు, ఈ ఊరు అనే తేడా లేదు. జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు ఎక్కడైనా అర్హత ఉన్న ఎవరైనా చట్టం, నిబంధనల మేరకు ఏదైనా చేయవచ్చు. దీనిని విశ్వవ్యాప్తంగా ఎవరూ కాదనరు. కానీ ఈనాడుకు మాత్రం సీఎం సొంత జిల్లా వారు ఎలాంటి వ్యాపారాలు చేయకూడదని, టెండర్లు దక్కించుకోకూడదన్న అభిప్రాయం నరనరానా జీర్ణించుకుపోయింది. అందుకే వారు వ్యాపారాలకు అనర్హులనేలా కథనాలు అల్లుతోంది. పెరుగుతున్న రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చ డానికి సీలేరులో రెండు అదనపు విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) టెండర్లు పిలిచింది. అత్యంత పారదర్శకంగా బిడ్లు ఆహ్వానించి, రివర్స్ టెండరింగ్ ద్వారా టెండరు ఖరారు చేసింది. కానీ ఇదంతా తప్పన్నట్టు 'ఈనాడు' శుక్రవారం ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఆ పత్రిక అధినేత రామోజీరావు పచ్చళ్లు అమ్ముకోవచ్చు.. పత్రికనూ నడుపుకోవచ్చు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే కంపెనీకి మాత్రం విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు టెండర్ ఇవ్వకూడదు. వారికి, వారు కొమ్ముకాస్తున్న వారికి ఒక న్యాయం.. సీఎం సొంత జిల్లా వారైతే మరో న్యాయం.. ఇదేం రామోజీ జర్నలిజం. ఏపీ జెన్‌కో వెల్లడించిన వివరాల ప్రకారం ఈ టెండర్లలో వాస్తవాలు అంశాల వారీగా ఇలా ఉన్నాయి.

ఆరోపణ: వైఎస్సార్ జిల్లాకు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ విద్యుత్ ప్రాజెక్టును కట్టబెట్టింది. ఈ సంస్థ వైఎస్సార్ జిల్లాకు చెందిన వ్యక్తికి సంబంధించినది కావడమే దానికి ఉన్న ఏకైక అర్హత.

వాస్తవం: ఏపీ జెన్‌కో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన రివర్స్ టెండరింగ్ ద్వారానే షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ఈ కాంట్రాక్టును కైవసం చేసుకుంది. ఇందులో ఏపీ జెన్‌కో, ప్రభుత్వం ప్రమేయం ఏమీ లేదు. ఈ కన్సార్టియం భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన ప్రతిష్టాత్మక బీహెచ్‌ఈఎల్‌తో ఈ ప్రాజెక్టు యంత్ర పరికరాల సరఫరాకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం ఉన్న యూనిట్లకు కూడా బీహెచ్‌ఈఎల్ యంత్ర పరికరాలు సరఫరా చేసింది. కన్సార్టియంలోని మరో కంపెనీ పీఈఎస్‌కు ఇదివరకే ఈ ప్రాజెక్టులో సివిల్ పనులు చేసిన అనుభవముంది. ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకుని, కాంట్రాక్టు సంస్థను ఎంపిక చేసింది. ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 2024కల్లా పూర్తవుతాయి.

ఆరోపణ: దిగువ సీలేరులో రెండు అదనపు యూనిట్ల నిర్మాణానికి అయ్యే వ్యయం, జీఎస్టీ, ఆలస్యానికి అయ్యే వడ్డీతో కలిపి రూ. 571 కోట్ల రుణాన్ని గ్రామీణ విద్యుత్ సంస్థ (ఆర్‌ఈసీ) నుంచి ప్రభుత్వం తీసుకుంది.

వాస్తవం: పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రుణం తీసుకోవడం సర్వసాధారణం. ఇందులో తప్పేముంది?

ఆరోపణ: ఇప్పటికే షిర్డీ సాయి, దాని అనుబంధ సంస్థలకు రూ. 92 వేల కోట్ల విలువైన వివిధ విద్యుత్ ప్రాజెక్టులను ప్రభుత్వం కట్టబెట్టింది.

వాస్తవం: ఏపీ జెన్‌కోగానీ, డిస్కంలు గానీ నామినేషన్ పద్ధతిలో ఏ పనులూ ఎవరికీ కేటాయించలేదు. వివిధ ప్రాజెక్టుల కోసం పారదర్శకంగా టెండర్లు నిర్వహించాయి. అర్హతల మేరకు పోటీ బిడ్డింగ్‌లో పాల్గొని ఏ సంస్థ అయినా పనులు దక్కించుకోవచ్చు.

ఆరోపణ: ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే కంపెనీకి జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రభుత్వం కట్టబెట్టింది.

వాస్తవం: అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ (గ్లోబల్ టెండర్లు– ఇ ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫారం) ద్వారా ఏపీ జెన్‌కో టెండర్లు పిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జుడిషియల్ కమిషన్ కూడా సమీక్షించి ఈ ప్రాజెక్టు టెండర్లకు ఆమోదం తెలిపింది. రాఘవ ఎంటర్‌ప్రైజెస్, ఎన్‌సీసీ, పీఈఎస్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిపి షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ జాయింట్ వెంచర్ సంస్థ బిడ్లు దాఖలు చేసింది. టెండర్లలో కోట్ అయిన అతి తక్కువ మొత్తాన్ని గరిష్టంగా తీసుకుని ఏపీజెన్‌కో రివర్స్ టెండర్లు నిర్వహించింది. ఈ రివర్స్ టెండరింగ్‌లో షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ తక్కువ మొత్తానికి ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చి కాంట్రాక్టు దక్కించుకుంది. రెండు దశల (సాంకేతిక, ఆర్థిక) బిడ్డింగ్ ప్రాతిపదికన ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు సంస్థను ఎంపిక చేసింది. రివర్స్ టెండరింగ్ ప్రక్రియ వల్ల ఏపీ జెన్కోకు దాదాపు రూ.10 కోట్లు ఆదా అయ్యింది.

ఆరోపణ: ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పర్యావరణ, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) అనుమతులు రాకముందే హడావుడి చేసింది.

వాస్తవం: విద్యుత్ కేంద్రం ప్రతిపాదనను ఏపీఈఆర్‌సీకి ముందే చెప్పారు. ప్రతిపాదనను పరిశీలించి డిస్కంలు, జెన్‌కో కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకుని కమిషన్ అనుమతి కోసం అప్పుడు పంపాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అనుమతి ఈ నెల 7న వచ్చింది. ఈ ప్రాజెక్టు పెట్టుబడి వ్యయం రూ.1000 కోట్లు దాటనందున కేంద్ర విద్యుత్ ప్రాధికారిక సంస్థ (సీఈఏ) అనుమతి అవసరం లేదు.

ఆరోపణ: రెండు కొత్త యూనిట్లు నిర్మించడం వల్ల దిగువ సీలేరు ప్రాజెక్టు నుంచి అదనంగా ఒక్క యూనిట్ విద్యుత్ కూడా ఉత్పత్తి అయ్యే పరిస్థితి లేదు.

వాస్తవం: జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి మన గ్రిడ్ అవసరాలకు అనుగుణంగా మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం ఉన్న నాలుగు 115 మెగావాట్ల యూనిట్లు ఏటా దాదాపు 1100 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నాయి. దిగువ సీలేరు విద్యుత్ కేంద్రం మొట్టమొదట నిర్మించినప్పుడే ఆరు యూనిట్ల ఏర్పాటుకు కావలసిన ప్రధాన మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో అదనంగా మరో రెండు 115 మెగావాట్ల యూనిట్లు నిర్మించాలని ఏపీ జెన్‌కో నిర్ణయించింది. కొత్త యూనిట్లు నెలకొల్పడం వల్ల ఈ విద్యుత్ కేంద్రం గరిష్ట లోడ్ సామర్థ్యం పెరుగుతుంది. దాంతో మార్కెట్ నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనవలసిన అవసరం తగ్గుతుంది. ప్రతి 115 మెగావాట్ల యంత్రం పీక్ డిమాండ్ సమయంలో సగటున 175 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయగలదు. దీనివల్ల డిస్కంలకు ఏటా 350 మిలియన్ యూనిట్లు విద్యుత్ మార్కెట్‌లో కొనాల్సిన అవసరం తగ్గి, ఆ మేరకు లాభం చేకూరుతుంది. పీక్ సమయాల్లో మార్కెట్ రేటు యూనిట్‌కు దాదాపు రూ.10 ఉంటోంది. సరాసరి పీక్ లోడ్ విద్యుత్ ధర రూ.8.0 అనుకున్నా ఈ రెండు యూనిట్ల వల్లా ఏటా దాదాపు రూ .280 కోట్లు ఆదా అవుతుంది.

నా వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేశారు

▶ మొదటి పేజీ తరువాయి



ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. సీబీఐ డైరెక్టర్‌ని, వివేకా కేసు విచారణాధికారి (ఏఎస్పీ)ని ప్రతివాదులుగా చేర్చారు. పిటిషన్‌లో ఆయన పేర్కొన్న వివరాలు.. 'ఏప్రిల్ 29న నేను వాంగ్మూలం ఇస్తుండగా.. అధికారి మరొకరిని లోపలికి పిలిచారు. ఆయన లాప్‌ట్యాప్‌తో వచ్చి ఏదో రికార్డు చేసుకున్నాడు. ఆయన ఏం రికార్డు చేసింది నాకు చూపించలేదు. కనీసం చదివి వినిపించలేదు. నాకు తెలిసినంతవరకు నా వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో రికార్డు కూడా చేయలేదు. సీబీఐ నా స్టేట్‌మెంట్‌ను తప్పుడు రికార్డు చేసినట్లు మే 17న ఓ పత్రికలో ప్రచురితమైన వార్త ద్వారా తెలుసుకున్నా. నా వాంగ్మూలం గురించి నేను ఎవరి వద్దా ప్రస్తావించలేదు. కానీ, ఆ పత్రికలో ఎలా వచ్చిందో నాకు అర్థంకాలేదు. ఆశ్చర్యం వేసింది. ఆ పత్రికలో పేర్కొన్నదంతా అసత్యపూరితం. పత్రికలో వచ్చిన దానిపై ఎలక్ట్రానిక్ మీడియా చర్చా కార్యక్రమాలు పెట్టడంతో నేను విలేకరుల సమావేశం పెట్టి.. ఆ పత్రికది కట్టుకథ అని చెప్పాల్సి వచ్చింది. సీబీఐ నమోదు చేసింది కూడా నేను చెప్పింది కాదని తెలిసింది. అయితే సీఆర్‌పీసీ 161 కింద రికార్డు చేసిన కాపీ నావద్ద లేనందున నా వాంగ్మూలం తప్పుగా పేర్కొన్న విషయాన్ని తెలుసుకోలేకపోయా. 2019 మార్చి 15న ఉదయం 5.30 గంటల సమయంలో అటెండరు వచ్చి అమ్మ (భారతి) పిలుస్తున్నారంటూ జగన్‌కు చెప్పాడని తాను చెప్పినట్లు, బయటకు వెళ్లిన జగన్ పది నిమిషాల తరువాత తిరిగివచ్చి చిన్నాన్న ఈజ్ నో మోర్ అని అన్నారని, షాక్‌కు గురైన మేము కడపకు వెళ్లాలని ఆయనకు సూచించి బయటకు వచ్చేశామని జూన్ నెలలో వేసిన చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది. ఈ విషయం పత్రికల్లో వచ్చిన సమాచారం ద్వారా నాకు తెలిసింది.

ఏం చెప్పానంటే..

ఏప్రిల్ 29న నన్ను విచారించిన అధికారికి స్పష్టంగా ఏం చెప్పానంటే.. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో తయారీ సమావేశం 2019 మార్చి 15న ఉదయం సుమారు 5 గంటలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లో ప్రారంభమైంది. అరగంట తర్వాత ఒక అటెండర్ సమావేశగది తలుపు తట్టాడు. బయటికి వెళ్లి విషయం తెలుసుకుని వచ్చిన ఓఎస్డీ.. జగన్ చెవిలో ఏదో చెప్పారు. దీంతో జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి, ఆశ్చర్యానికి గురయ్యారు. 'చిన్నాన్న చనిపోయారు' అని చెప్పారు. అంతేతప్ప జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన జీవిత భాగస్వామిని పిలవడం లాంటివి ఏమీ చెప్పలేదు. దురదృష్టవశాత్తు నేను చెప్పింది సీబీఐ సరిగ్గా రికార్డు చేయలేదు. చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది పూర్తిగా అసంబద్ధం. దర్యాప్తును తప్పుదారి పట్టించి.. ఇతరులను కేసులో ఇరికించే ధోరణితోనే సీబీఐ ఇలా తప్పుగా పేర్కొంది. నా స్టేట్‌మెంట్‌పై సంతకం చేసిన అధికారి, నన్ను విచారించిన అధికారి ఒకరు కాదు. దర్యాప్తు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రాజ్యాంగ ధర్మాసనాలు పదేపదే చెబుతున్నా.. కొందరు మాత్రం వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. దర్యాప్తు చేయడం అంటే అస్పష్టమైన సత్యాన్ని బయటికి తీసుకురావడం. కానీ, ఇక్కడ అధికారులు అలా వ్యవహరించలేదు. నేను చెప్పకున్నా చెప్పినట్లు సీబీఐ తప్పుడు వాంగ్మూలాన్ని సమర్పించడం ఎంత మాత్రం సరికాదు. ఇతర వ్యక్తులను చిక్కుల్లో పడేసేందుకే సీబీఐ తప్పుడు సమాచారం చేర్చింది. ఈ అంశాలను పరిశీలించి హైదరాబాద్ సీబీఐ కోర్టులో సమర్పించిన చార్జిషీట్ నుంచి తప్పుడు వాంగ్మూలాన్ని తొలగించాలి.'

ఏపీ ఇన్ పార్లమెంట్

ప్రత్యేకదళాల్లో చేరికకు లింగభేదం లేదు

సాక్షి, న్యూఢిల్లీ: భారత సాయుధ దళాల్లోని ప్రత్యేకదళాల్లో చేరడానికి లింగభేదం లేదని కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి అజయ్ భట్ తెలిపారు. గుణాత్మక అవసరాల మేరకు ఎంపిక, విజయవంతమైన శిక్షణ పూర్తిచేస్తే మహిళా అధికారులు ఎలాంటి లింగభేదం లేకుండా ప్రత్యేకదళాల్లో స్వచ్ఛందంగా చేరడానికి అర్హులని చెప్పారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు వంగా గీత, బి.వి.సత్యవతి, గొడ్డేటి మాధవి, ఆదాల ప్రభాకరరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. భారత వైమానిక దళంలో ఇద్దరు మహిళలు ప్రత్యేకదళాల శిక్షణకు స్వచ్ఛందంగా వచ్చారని, అయితే వారు ఉత్తీర్ణత సాధించలేకపోయారని తెలిపారు. నేవీలో 20 మంది అగ్నివీర్‌లు ప్రత్యేకదళంలో చేరడానికి పరీక్షకుహాజరయ్యారని, వారెవరూ అర్హత సాధించలేకపోయారని చెప్పారు.

దేశవ్యాప్తంగా 122 మంది మెడికోల ఆత్మహత్య

దేశవ్యాప్తంగా 559 వైద్య కళాశాలలు ఇచ్చిన సమాచారం మేరకు 122 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి భారతీప్రవీణ్ పవార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. నేషనల్ మెడికల్ కమిషన్‌లోని యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆర్‌టీఐ దరఖాస్తుకు సమాధానంగా ఐదేళ్లలో ఆత్మహత్యలు, డ్రాప్ అవుట్‌ల వివరాలు ఇచ్చిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పీజీలో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా.. తొమ్మిది కళాశాలల్లో 38 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారని తెలిపారు. ఎంబీబీఎస్‌లో మూడు కళాశాలల్లో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా.. ఆరు కళాశాలల్లో 13 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారని చెప్పారు.

మైన్స్ మినరల్స్ సవరణ బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు

మైన్స్, మినరల్స్ సవరణ బిల్లు–2023కు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. ఈ బిల్లుపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం 16,604 ఎకరాల్లో 16 బీచ్‌శాండ్ మినరల్స్ బేరింగ్ ఏరియాలను ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు రిజర్వు చేసిందని తెలిపారు. 14 మినరల్ బేరింగ్ ఏరియాలకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఇంటిగ్రేటెడ్ బీచ్‌శాండ్ మినరల్స్ ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ స్థాపించి వైఎస్సార్ జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తద్వారా రాయలసీమ ప్రజలకు స్థిరమైన ఉపాధి, జీవనోపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఉక్కు కర్మాగారం ఏడాదికి మూడు మిలియన్ టన్నుల సామర్థ్యంతోపాటు హై-గ్రేడ్ స్టీల్ ఉత్పత్తిపై దృష్టి సారిస్తుందని తెలిపారు.

మాయల ఫకీరు బాబు మాయలో పడొద్దు

- పురందేశ్వరి వ్యాఖ్యలపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కౌంటర్

సాక్షి, విశాఖపట్నం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాటలు ఆమె మరిది చంద్రబాబు స్క్రిప్టులా ఉన్నాయి తప్ప సొంతంగా మాట్లాడారని అనిపించడంలేదని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలా? లేక బాబు గారి జనతా పార్టీకి అధ్యక్షురాలా? అనే సందేహం వస్తోందన్నారు. మంత్రి శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. మాయల ఫకీరు చంద్రబాబు ట్రాప్‌లో పడితే పురందేశ్వరి భర్త దగ్గుబాటి వెంకటేశ్వర్లు రాజకీయ జీవితం భూస్థాపితం అయిపోయినట్లే ఆమె రాజకీయ జీవితమూ ముగిసిపోతుందని చెప్పారు. ఆమె భర్త ఆనాడు రాసిన పుస్తకానికి పార్ట్–2 రాయాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నీ మద్యం ఆదాయంతోనే ఇస్తున్నారని అంటున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మద్యం లేదా? ఆదాయం రావడంలేదా అని ప్రశ్నించారు. వివిధ విభాగాల ఆదాయంతోనే ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వ నిర్ణయాలు, హామీలను అమలు చేస్తారని చెప్పారు. పురందేశ్వరి ఆమె మరిది బాబు హయాంలోని భూ కుంభకోణాలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. విశాఖ ఎంపీగా చేసిన ఆమె విశాఖ రైల్వే జోన్‌పైన, విశాఖ ఉక్కు పైన ఎందుకు మాట్లాడటంలేదని నిలదీశారు.

సినిమా

పట్టుకుంటే పది వేలు



• ధనుష్

బందిపోటుగా, హంతకుడిగా ముద్రపడిన 'కెప్టెన్ మిల్లర్'ను పట్టుకున్న వారికి పదివేల రూపాయల రివార్డును ప్రకటిస్తూ 1930లో ఓ పోలీస్ నోట్ విడుదలైంది. మరి.. అప్పటి ప్రభుత్వానికి కెప్టెన్ మిల్లర్ చిక్కాడా? అసలు అతని కథ ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానాలు డిసెంబరులో థియేటర్స్‌లో దొరుకుతాయి. ధనుష్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో టీజీ త్యాగరాజన్, సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) ధనుష్ బర్త్ డే. ఈ సందర్భంగా 'కెప్టెన్ మిల్లర్' టీజర్‌ను విడుదల చేసి, సినిమాను డిసెంబరు 15న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో 'కెప్టెన్ మిల్లర్'లో కీలక పాత్ర చేసిన హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఈ సినిమా కాకుండా ధనుష్ అన్న దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డీ 50'లోనూ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాను'' అని అన్నారు. ''1930–1940 నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీ రోల్ చేస్తున్నారు.

నెచ్చెలి విసిరినది వెచ్చని వల...



• సమంత, విజయ్ దేవరకొండ

'ఖుషీ నువ్వు కనబడితే.. ఖుషీ నీ మాట వినబడితే...' అంటూ మొదలైంది 'ఖుషి' సినిమా టైటిల్ సాంగ్. విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం ఇది. శివ నిర్వాణ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం సెప్టెంబరు 1న విడుదల కానుంది. ఈ సినిమా టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. 'ఖుషీ నువ్వు కనబడితే' అని మొదలై, 'హే నెచ్చెలి నెచ్చెలి వచ్చి విసిరినది వెచ్చని వెచ్చని వల.. హే ముచ్చటగా నను గిల్లి గిచ్చినది కల..' అంటూ సాగుతుందీ పాట. దర్శకుడు శివ నిర్వాణ ఈ పాటకు లిరిక్స్ అందించగా, ఈ చిత్ర సంగీత దర్శకుడు హిషామ్ అబ్దుల్ వాహబ్ పాడారు.

లక్కీ భాస్కర్



• దుల్కర్ సల్మాన్

'మహానటి, సీతారామం' వంటి వరుస విజయాల తర్వాత తెలుగులో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ధనుష్‌తో 'సార్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) దుల్కర్ సల్మాన్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ప్రకటించారు. ''నమ్మశక్యం కాని విధంగా ఉన్నత శిఖరాలకు చేరిన ఒక సాధారణ మనిషి కథగా 'లక్కీ భాస్కర్' రూపొందుతోంది. ఈ చిత్రం ద్వారా వెంకీ అట్లూరి మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు'' అని నిర్మాతలు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

'కాంత'.. దుల్కర్ బర్త్ డే సందర్భంగా 'కాంత' అనే మరో చిత్రం ప్రకటన వెల్లడైంది. ఈ చిత్రంలో దుల్కర్ హీరోగా నటించడంతో పాటు రానాతో కలిసి నిర్మిస్తున్నారు. గతంలో 'నిలా' చిత్రం, 'ద హంట్ ఆఫ్ వీరప్పన్' డాక్యుమెంటరీ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ 'కాంత'ను తెరకెక్కించనున్నారు.

హద్దుల్లో ఉంటే అడ్డే ఉండదు

- హీరోయిన్ శ్రీలీల



''చిత్ర పరిశ్రమ అనేది గౌరవం ఉన్న ఇండస్ట్రీ. మన హద్దుల్లో మనం ఉండి సినిమాలు చేసుకుంటే అడ్డేదీ ఉండదు.. ఎలాంటి ఇబ్బందులు రావు. తెలుగమ్మాయి అయిన హీరోయిన్ ప్రణవికి నేను ఇచ్చే సలహా ఇదే'' అని హీరోయిన్ శ్రీలీల అన్నారు. సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమా రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ ద్వారా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలీల మాట్లాడుతూ– ''స్లమ్ డాగ్ హజ్బెండ్' సినిమా సూపర్ హిట్ కావాలి'' అన్నారు. ''మా సినిమాలో వినోదం, భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి'' అన్నారు ఏఆర్ శ్రీధర్. ''శ్రీలీల, వైష్ణవీ చైతన్య, ప్రణవి తెలుగు అమ్మాయిలే. నా కొత్త సినిమాకు తెలుగు అమ్మాయినే హీరోయిన్‌గా తీసుకుంటా'' అన్నారు డైరెక్టర్ బుచ్చిబాబు సానా. ''స్లమ్ డాగ్ హజ్బెండ్' హిట్ అయితే మరో పది మంది కొత్తవాళ్లకు అవకాశాలు ఇస్తాం'' అన్నారు అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి.



• అదితీరావ్ హైదరి

తొలి అడుగు

ఇటు సౌత్.. అటు నార్త్.. కాస్త ఖాళీ దొరికితే డిజిటల్ వరల్డ్... ఇలా వరుస ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంటున్నారు హీరోయిన్ అదితీరావ్ హైదరి. అయితే తొలిసారి ఈ బ్యూటీ ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ సమాచారం. తమిళ దర్శక–నటుడు రాజేష్ ఎమ్. సెల్వ ఇటీవల కథానాయిక ప్రాధాన్యంగా సాగే ఓ కథ తయారు చేశారని, ఈ కథ విని, ఇందులోని పాత్ర నచ్చడంతో అదితీరావ్ హైదరి పచ్చ జెండా ఊపారని కోలీవుడ్ టాక్. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెలలో ఆరంభం కానుందట. లేడీ ఓరియంటెడ్ చిత్రాల పరంగా అదితీకి ఇది తొలి అడుగు. మరి.. ఈ తొలి అడుగుతో ఈ తరహా చిత్రాలు ఇంకెన్ని చేస్తారో చూడాలి. ఇక 'సమ్మోహనం, వి, అంతరిక్షం, మహాసముద్రం' వంటి చిత్రాలతో అదితీరావ్ హైదరి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే.

అంతా మంచే జరుగుతుంది

- విష్ణు మంచు



• తేజ్, విష్ణు మంచు, రిషిక

''ఇండస్ట్రీలో ఓ యాక్టర్‌కి, మేకప్ మేన్‌కి ఉన్న బంధం భార్యాభర్తల్లాంటిది. నేను చిన్నప్పటి నుంచి మేకప్‌మేన్ చంద్రగారిని చూస్తున్నాను. ఓ రైటర్‌గా, డైరెక్టర్‌గా, నిర్మాతగా సినిమా చేయటం అంత సులభం కాదు.. ఆయన మంచి మనసుకి అంతా మంచే జరుగుతుంది. 'మాధవే మధుసూదనా' సినిమా పెద్ద సక్సెస్ కావాలి'' అని హీరో విష్ణు మంచు అన్నారు. తేజ్ బొమ్మదేవర, రిషికా లోక్రే జంటగా రూపొందుతోన్న చిత్రం 'మాధవే మధుసూదనా'. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో బొమ్మదేవర రామచంద్ర రావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను విష్ణు మంచు రిలీజ్ చేశారు. బొమ్మదేవర రామచంద్ర రావు మాట్లాడుతూ–'' నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన అన్నపూర్ణ స్టూడియో సంస్థకు, నాగార్జునగారికి రుణపడి ఉంటాను. మోహన్ బాబుగారు సింగపూర్‌లో ఉండటం వల్ల ఆయన స్థానంలో విష్ణుని పంపించినందుకు కృతజ్ఞతలు'' అన్నారు.

రీల్స్

డబుల్ ఇస్మార్ట్‌లో..



• సంజయ్ దత్

తెలుగులో మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారట బాలీవుడ్ నటుడు సంజయ్ దత్. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని ఓ కీలక పాత్రకు సంజయ్ దత్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఈ చిత్రంలో భాగం కావడానికి సంజయ్ దత్ సుముఖంగా ఉన్నారని టాక్.

కేరాఫ్ దెయ్యం...



• రవిబాబు

ఒకప్పుడు గ్రామాల్లో మాతంగులుగా జీవించిన వారిలో ఒక స్త్రీ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'భయం.. కేరాఫ్ దెయ్యం'. మాతంగిగా రమ్య, మాంత్రికుడిగా నటుడు–దర్శకుడు రవిబాబు, తాంత్రికుడిగా నటుడు సత్యప్రకాష్ ముఖ్య పాత్రలు చేశారు. సీవీఎస్ఎం వెంకట రవీందర్‌నాథ్ దర్శకత్వంలో పెదారికట్ల చేనెబోయిన్న నరసమ్మ, వెంకటేశ్వర్లు నిర్మించారు. ''హారర్, థ్రిల్లర్ అంశాలు జోడించి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇటీవల జరిపిన రెండో షెడ్యూల్‌లో రవిబాబుపై సీన్స్ తీశాం. కన్నడ, తెలుగు భాషల్లో నిర్మించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో తెలియజేస్తాం'' అని దర్శక–నిర్మాతలు అన్నారు.

రోడ్స్ బ్లాకు...



• శివానీ, శ్రీ కమల్

'ఆకు పాకు ఇస్తరాకు.. ఆల్ సైడ్స్ రోడ్స్ బ్లాకు..' అంటూ సాగే పాట 'జిలేబి' చిత్రంలోనిది. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి', 'మన్మథుడు' వంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు కె. విజయ భాస్కర్ కొంత గ్యాప్ తర్వాత తెరకెక్కించిన చిత్రం ఇది. శ్రీ కమల్, శివానీ రాజశేఖర్ జంటగా గుంటూరు రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమాలోని 'ఆకు పాకు..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరకల్పనలో రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు.

ఓ ప్రేమకథ



• మోక్ష, వికాస్ వశిష్ఠ, కుషిత

వికాస్ వశిష్ఠ, మోక్ష, కుషిత కళ్లపు హీరో హీరోయిన్లుగా అంజిరామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'నీతోనే నేను'. ఈ సినిమా టైటిల్, పోస్టర్‌ను చిత్ర నిర్మాత ఎమ్. సుధాకర్ రెడ్డి బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేశారు. ''చదువుకునే టైమ్‌లోనే సినిమా తీయాలనే కల ఉండేది. మంచి టీమ్‌తో 'నీతోనే నేను' తీశాను'' అన్నారు ఎమ్. సుధాకర్ రెడ్డి. ''ఈ సినిమా కోసం టీమ్ ప్రాణం పెట్టి పని చేశారు'' అన్నారు అంజిరామ్. ''ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే చిత్రమిది'' అన్నారు వికాస్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నవీన్, కెమెరామేన్ మురళీ మోహన్, మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్ బి. కడగండ్ల పాల్గొన్నారు.